క్లుప్తంగా

పార్క్ చేసిన బుల్లెట్ చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టెంపుల్ వద్ద పార్క్ చేసిన బుల్లెట్ బైక్ చోరీ అయిన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. విజయవాడ గులాబీతోటకు చెందిన అల్లూరి సునీల్‌కుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం గొల్లపూడిలోని అయ్యప్పస్వామి టెంపుల్‌లో బంధువుల ఫంక్షన్‌కు తన బుల్లెట్‌పై వచ్చాడు. గుడిలోకి వెళ్తూ తన బుల్లెట్‌ను(ఏపీ39ఎస్ఎక్స్ 1418) బయట పార్క్ చేశాడు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఫంక్షన్ ముగించుకుని వచ్చి చూడగా బుల్లెట్ కనిపించలేదు. దీనిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీస్ స్పందనలో 72 ఫిర్యాదులు



విజయవాడ స్పోర్ట్స్: విజయవాడలోని జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో 72 మంది బాధితుల నుంచి డీసీపీ విశాల్‌గున్ని, వి.అజిత ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ కలహాలపై 10, నగదు లావాదేవీలపై 21, ఆస్తి వివాదాలపై 13, మోసాలకు సంబంధించి 13, ఇతర ఘటనలకు సంబంధించి 15 మంది ఫిర్యాదులు అందజేశారు. నిర్ణీత కాల వ్యవధిలో ఫిర్యాదులను పరిష్కరించాలని స్టేషన్ అధికారులను ఆదేశించారు.

వీఎంసీ స్పందనలో 11 అర్జీలు



పటమట(విజయవాడతూర్పు): స్పందనలో వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పూర్తిచేసి పరిష్కార సమాచారం అందించాలని అదనపు కమిషనర్ (జనరల్) శకుంతల, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో అధికారుల బృందంతో కలిసి అర్జీలు స్వీకరించారు. మొత్తం 11 అర్జీలు రాగా వాటన్నింటినీ వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగంపై -4, పట్టణ ప్రణాళిక విభాగం-4, రెవెన్యూ విభాగం-2, పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారికి ఒక అర్జీని స్వీకరించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జీఎస్వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) వెంకటలక్ష్మి, పట్టణ సాధికార విభాగం అధికారి రోహిణి, ఉద్యానవన విభాగం అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎస్ఆర్ఆర్ విద్యార్థులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల స్విమ్మింగ్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ విద్యార్థులు బి.బాలగంగాధర్, పి.శరణ్‌చౌదరి సత్తాచాటి సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి వ్యాయామ అధ్యాపకులు ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్‌లతో కలిసి సోమవారం విద్యార్థులను సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు సౌత్‌జోన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అలాగే తమ కళాశాలకు చెందిన హాకీ క్రీడాకారులు జి.సురేంద్ర, జి.గోపీకృష్ణ, కె.కార్తీక్‌కుమార్, మహమ్మద్‌భాషా, కె.శివ కృష్ణా వర్శిటీ అంతర్ కళాశాల హాకీ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో సౌత్‌జోన్ హాకీ టోర్నమెంట్‌కు వెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): చిన్నప్పటి నుంచి ఒత్తిడి లేని విద్యతో పాటు, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని మాజీ రంజీ ప్లేయర్, ఆంధ్రా క్రికెట్ బోర్డు సలహామండలి సభ్యుడు జి.మల్లిఖార్జునరావు తెలిపారు. బెంజిసర్కిల్ సమీపంలోని నలంద విద్యానికేతన్‌లో సోమవారం కేజీ చిన్నారుల 26వ వార్షిక స్పోర్ట్స్ మీట్ ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ స్పోర్ట్స్‌మీట్‌ను స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజతో కలిసి మల్లికార్జునరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో నలంద కిండర్ గార్టెన్ విద్యార్థులతో పాటు, వన్‌టౌన్‌లోని నలంద టాడ్లర్స్ చిన్నారులూ పాల్గొన్నారు. పోటీల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు 600 మంది ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

విజయవాడను మేటిగా నిలపడమే లక్ష్యం



63వ డివిజన్‌లో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

పాయకాపురం(విజయవాడరూరల్): దేశంలో అభివృద్ధి చెందిన ప్రముఖ నగరాల సరసన విజయవాడను మేటిగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 63వ డివిజన్ ఎల్ఐజీ అండ్ ఉడా కాలనీల్లో రూ. 50 లక్షలతో ఎనిమిది నూతన అంతర్గత రహదారుల నిర్మాణానికి డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు మోదుగుల తిరుపతమ్మ, యరగొర్ల తిరుపతమ్మతో కలిసి సోమవారం ఆయన భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం 64వ డివిజన్ కండ్రికలో రూ. 15.35 లక్షలతో నిర్మించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలన ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడలేదని విమర్శించారు. జగనన్న పాలనలో నియోజకవర్గ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు వెల్లడించారు. 63వ డివిజన్‌లో గత నాలుగున్నరేళ్లలో రూ. 5.30 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టగా, 64వ డివిజన్‌లో రూ. 7.61 కోట్ల పనులు చేపట్టినట్లు వివరించారు. అలాగే పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతీ ఒక్క డివిజన్‌లోనూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాల నిర్మాణాన్ని ఒక పాలసీగా ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. సెంట్రల్ నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే విష్ణు ప్రజలను కోరారు. కార్యక్రమంలో సీఈ(సీఆర్డీఏ) జీవీ.పళ్ళంరాజు, ఈఈ ఆర్.హనుమంతరావు, డీఈ నాగవెంకట్, డీఈ(వీఎంసీ) గురునాథం, నాయకులు యరగొర్ల శ్రీరాములు, ఎస్‌కె.ఇస్మాయిల్, పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, వెంకటేశ్వరమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకోటేశ్వరావు, వార్డు సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి



శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుడు



శివరామకృష్ణ క్షేత్రంలో విశేష అలంకరణతో సుబ్రహ్మణ్యస్వామి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. మధురానగర్‌లోని స్వయంభూ శ్రీబాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో షష్ఠి మహోత్సవాల్లో భాగంగా శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామివారి కల్యాణంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుమారు 70 మంది దంపతులు సామూహిక కల్యాణోత్సవంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి పుట్టలో పాలు పోశారు. దాతల సహకారంతో 5వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన జరిగాయి. ఆలయంలోని నాగేంద్రస్వామివారికి విశేషంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని జంట నాగులకు విశేషంగా అర్చనలు నిర్వహించారు.

శివరామకృష్ణ క్షేత్రంలో...

విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మాధికారి ఎస్.హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ జగద్గురు భారతీతీర్థ మహాసన్నిధానం సన్యాసాశ్రమ స్వీకార స్వర్ణోత్సవ మహోత్సవముల సందర్భంగా 20వ తేది నుంచి 10 రోజులపాటు ఆధ్యాత్మికవేత్త మల్లాది వేంకటరామనాథశర్మ భారతీతీర్థ మహాస్వామి వైభవం అంశంగా ప్రసంగం చేస్తారని తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీ సాయిబాబా నాగమానసాదేవి మందిరంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి ఘనంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి జన్మనక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఉదయాన్నే స్వామివారికి పాలు, పండ్లు, పువ్వులు, వెండి పడగలు, వెండి కళ్ళు మొదలైన మొక్కులు సమర్పించుకున్నారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి 11 రకాల దివ్యములతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అత్యంత వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం జరిగింది. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ



సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, పంటలను ఆశించే చీడపీడలను సమర్థంగా ఎదుర్కోవచ్చని వ్యవసాయశాఖ డెప్యూటీ డైరెక్టర్ విజయకుమారి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యాన ఏపీ వ్యవసాయశాఖ సహకారంతో ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు వర్క్‌షాప్ జరిగింది. ముఖ్య అతిథి విజయకుమారి మాట్లాడుతూ.. సుభాష్ పాలేకర్ సూచించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ కంచెపంటలు, అంతర, ఆకర్షిత పంటలతో ఏడాది పొడవునా పొలాలను ఖాళీగా ఉంచకుండా సాగు చేయడం ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించొచ్చని సూచించారు. ఘన, ద్రవ జీవామృతాలను వాడుతూ దేశీ విత్తనాలతో సాగుచేయడం ద్వారా పంటలకు సహజ రోగ నిరోధక శక్తి సిద్ధిస్తుందన్నారు. సేంద్రీయ వ్యవసాయం వల్ల అనారోగ్య సమస్యలను సైతం తగ్గించొచ్చని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, వృక్షశాస్త్ర విభాగాధిపతి ఎం.ఎస్.జి.స్వప్న మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రకృతి సేద్యంపై అవగాహన పెంచేందుకు ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించి వాటి ప్రయోజనాలను రైతులు వివరించారు. కళాశాల అధ్యాపకులు వి.నాగపద్మావతి, సీహెచ్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో గత 18 సంవత్సరాలుగా దాతల సహకారంతో నగరపాలకసంస్థ పాఠశాలల విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లిస్తున్నామని మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. సాయిబాబా మందిరంలో 13 నగరపాలక సంస్థ పాఠశాలలకు చెందిన 1368 మంది విద్యార్థులకు 10వ తరగతి పరీక్ష ఫీజు చెల్లించే కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ షిర్డీలో మాదిరిగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ ఏటా 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులను దాతల సహకారంతో చెల్లిస్తున్నామని చెప్పారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రూ. 1 లక్ష 71 వేలు నగరపాలకసంస్థ పాఠశాల హెచ్ఎంలకు అందజేశారు. కార్యక్రమంలో మందిర కమిటీ కార్యదర్శి పి.మల్లయ్య, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీకి చెందిన షేక్ నితిన్(18) ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందగా పోలీసులు అనుమానాస్పద మృతిగా సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, మృతుడు నితిన్ సంవత్సరం క్రితం బెంగుళూరులో అక్క ఇంటి వద్ద ఉన్నాడు. అప్పుడు ఒక అమ్మాయిని ప్రేమించినట్లు తల్లి షేక్ మంజుకి చెప్పాడు. ఈ విషయంలో తల్లి కొడుకుని మందలించడంతో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో నితిన్ ఆదివారం ఉరి వేసుకొన్నాడు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా తలుపు గడియపెట్టి ఉంది. ఎంతసేపటికి తలుపులు తీయకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతిచెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి పంపారు. తల్లి మంజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెన్ని కాయిట్‌లో సిద్ధార్థ ఫార్మసీ విద్యార్థినుల ప్రతిభ



విజయవాడ స్పోర్ట్స్: చిప్స్ స్పోర్ట్స్ ఫెస్ట్ టెన్ని కాయిట్ సీనియర్స్ పోటీల్లో విజయవాడ కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కాలేజీ జట్టు రన్నర్ ట్రోఫీని అందుకుంది. గుంటూరు జిల్లా చోడవరంలోని చేబ్రోలు హనుమయ్య కాలేజీలో నిర్వహించిన పోటీలకు సిద్ధార్థ పార్మసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు పావని, మోక్షిత పాల్గొని రెండో స్థానాన్ని సొంతం చేసుకున్నారు. ట్రోఫీ సాధించిన క్రీడాకారిణులను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సునీత, ఫిజికల్ డైరెక్టర్ ఎల్.వినయ్‌శేఖర్ అభినందించారు.

సర్వజనులకు యాగ ఫలాలు

ముగిసిన వైభవ సుబ్రహ్మణ్య యాగం



అనుగ్రహ భాషణ చేస్తున్న శివాచార్య స్వామి

విజయవాడ కల్చరల్: ధర్మరక్షకు కట్టుబడి ఉండాలని శివజ్ఞాన పీఠాధిపతి శివచార్య స్వామి భక్తులకు సూచించారు. శివజ్ఞానపీఠం ఆధ్వర్యంలో సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న వైభవ సర్వ సుబ్రహ్మణ్య యాగం సోమవారం ముగిసింది. స్వామిజీ మాట్లాడుతూ ధర్మాన్ని మనం కాపాడితే ధర్మం మనలను కాపాడుతుందని తెలిపారు. యాగఫలాలు సర్వజనులకు అందించాలనే సంకల్పంతోనే కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఆడిటర్ పెనుగొండ సుబ్బారాయుడు పీఠం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ళ విద్యాధరరావు, అర్బన్ ఆర్యవైశ్య అధ్యక్షుడు పల్లపుట్టి మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఉదయం నిత్యవిధి, చతుర్థకాల యాగపూజ, సుబ్రహ్మణ్య షోడశ మూలమంత్రహోమం, సహస్ర రజిత సుబ్రహ్మణ్య వత్రం, పూర్ణాహుతి కార్యక్రమాలు స్వయంగా నిర్వహించారు. వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ మూర్తులతో శోభాయాత్ర నిర్వహించారు. వేద మంత్రాలతో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బ్రెయిన్ బి పోటీల్లో మౌనిక ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): అమరావతి బ్రెయిన్ బి సొసైటీ ఆధ్వర్యంలో రీజినల్ బ్రెయిన్ బి పోటీలు ఈ నెల 16న గుంటూరు ప్రభుత్వాస్పత్రిలోని న్యూరాలజీ విభాగంలో నిర్వహించారు. ఈ పోటీల్లో గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలోని ఇంటర్మీడియట్ బైపీసీ విద్యా ర్థులు పాల్గొనగా, శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని జి.మౌనిక సత్తా చాటింది. ఆ పోటీలకు న్యాయనిర్ణేతలుగా న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్వీ సుందరాచారి, డాక్టర్ అరుణ వ్యవహరించారు. అత్యుత్తమ ప్రతిభతో మౌనిక మొదటి బహుమతి పొందినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మౌనికను ప్రిన్సిపాల్ పద్మజతో పాటు పలువురు అభినందించారు.

అవ్వాతాతలకు అండగా జగనన్న సర్కార్

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ



గోసాల వృద్ధుల ఆశ్రమంలో కేక్ కట్ చేస్తున్న పడమట స్నిగ్ధ

పెనమలూరు: రాష్ట్రంలో అవ్వాతాతలకు అండగా జగనన్న నిలిచారని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. సోమవారం గోసాల గ్రామంలోని వృద్ధుల ఆశ్రమంలో వృద్ధుల సమక్షంలో కేక్‌కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత అవ్వాతాతలకు భరోసా ఏర్పాడిందన్నారు. వృద్ధులకు వైఎస్సార్ పింఛన్ కానుక దశలవారీగా పెంచి జనవరి నాటికి రూ. 3 వేలు చేయబోతున్న ఘనత జగనన్నకు దక్కిందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ సంగెపు శ్రీనివాసరావు,ఏఎంసీ డైరెక్టర్ పోలవరపు రవి, నేతలు షేక్ పీర్‌అహ్మద్, షేక్ నాసర్, ఎండీ ఆసిఫ్, ఎండీ దాదా, భువనగిరి వెంకటరమణ, గోపాలరావు పాల్గొన్నారు.

త్వరలో కాపు కమ్యూనిటీ హాలు ప్రారంభం



కాపు కమ్యూనిటీ హాలు

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గం 62వ డివిజన్‌లో నిర్మిస్తున్న కాపు కమ్యూనిటీ హాలు అతిత్వరలో ప్రారభించడానికి సిద్ధమవుతోంది. నగరంలోనే మొట్టమొదట కాపు కమ్యూనిటీ హాలుగా దీన్ని చెప్పవచ్చును. గతంలో అనేక ప్రభుత్వాలు అధికారంలోకి రావడం జరిగింది కానీ, కాపులు అధికంగా ఉన్న విజయవాడ నగరంలో కాపు కులస్థులకు ఆ పేరుతో ప్రత్యేకంగా నిర్మించిన కమ్యూనిటీ హాలు ఎక్కడా లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే మల్లాది విష్ణు 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లో కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం నుంచి కాపు కార్పొరేషన్ నిధులు కోటి రూపాయలను మంజూరు చేయించి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తానేటి వనితా, మంత్రి బొత్స సత్యనారాయణ, మంత్రి అంబటి రాంబాబు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మీతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో భూమిపూజ చేయించారు. కమ్యూనిటీ హాలు నిర్మాణం పనులు చురుగ్గా జరిగే విధంగా ఎమ్మెల్యే పర్యవేక్షించారు. అన్ని శుభ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు వీలుగా కమ్యూనిటీ హాలు నిర్మాణం జరిగిందని వీఎంసీ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు గురునాథం తెలిపారు. కాపు సామాజిక వర్గం అధికంగా వుండే ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాలు నిర్మాణం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. అనుకున్న విధంగా అన్ని హంగులు సమకూరితే ఈ నెల 26వ తేదీ మాజీ ఎమ్మెల్యే, కాపు నాయకుడు వంగవీటి మోహనరంగా వర్ధంతి నాడు కమ్యూనిటీ హాలు ప్రారంభించనున్నారు.

ఎమ్మెల్యే కృషితో నిర్మాణం



ఈ ప్రాంతంలో కాపు కమ్యూనిటీ హాలు అవసరం చాలా వుంది. పేద, బడుగు బలహీన వర్గాల శుభకార్యాలకు కమ్యూనిటీ హాలు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు కృషితో కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణం జరిగింది. అన్ని వర్గాల ప్రజానీకం దీన్ని ఉపయోగించుకోవచ్చును.

– అలంపూరు విజయలక్ష్మి, కార్పొరేటర్

గతంలో ఎన్నడూలేని విధంగా



గతంలో ఎన్నడూలేని విధంగా 62వ డివిజన్‌లో అభివృద్ధి పనులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగాయి. గత ప్రభుత్వం కాపు కమ్యూనిటీ హాలు నిర్మిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చింది. కానీ పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వంలో కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణం జరగడం సంతోషకరం.

– సీహెచ్‌వీ రామిరెడ్డి, స్థానికుడు

ఆరోగ్యశ్రీపై అవగాహన పెంచుదాం



ఆరోగ్యశ్రీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ అనిత, సచివాలయ సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై లబ్ధిదారులకు అవగాహన పెంచుదామని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత పిలుపునిచ్చారు. ఆరోగ్యశ్రీకి సంబంధించిన సమగ్ర సమాచారంలో ప్రభుత్వం ముద్రించిన బ్రోచర్లను సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 91, 92వ వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 25 లక్షలకు పెంచారని చెప్పారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను రూపొందించడంతో పాటు, కొత్త కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా సమగ్ర సమాచారం అరచేతిలోనే ఉంటుందని పేర్కొన్నారు. యాప్‌లో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలు, చికిత్సల వివరాలు ఉంటాయని ఆమె వివరించారు. కార్యక్రమంలో అడ్మిన్ సెక్రటరిలు మురళీ, సతీష్, వెల్ఫేర్ సెక్రటరి కీర్తి, వీఆర్ఓ ఝాన్సీ, పార్టీ నేత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలకుడు సీఎం జగన్



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంక్షేమ పాలకుడిగా పేరు తెచ్చుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భవిష్యత్తు తరాలకు భరోసాగా నిలబడ్డారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ 251వ వార్డు సచివాలయ పరిధిలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దావు బుచ్చయ్యకాలనీలో ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించి ప్లానింగ్ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా పని చేయాలని వార్డు సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

చంద్రబాబుకు ఎన్నికల భయం పట్టుకుంది

చంద్రబాబుకు ఎన్నికల భయం పట్టుకుందని ఎమ్మెల్యే విష్ణు పేర్కొన్నారు. సీఎం జగన్ ప్రభంజనాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక తర్జనభర్జన పడుతున్నారని విమర్శించారు. చివరకు బాబు సుదీర్ఘ అనుభవం పవన్‌కళ్యాణ్ ముందు మోకరిల్లిందని ఎద్దేవా చేశారు. నారా లోకేష్ యువగళం ముగింపు కార్యక్రమానికి రాలేనని పవన్ తేల్చి చెప్పడంతో ఆఘమేఘాల మీద చంద్రబాబు వెళ్లి పవన్‌ను కలిశారన్నారు. పదే పదే తెలుగు వారి ఆత్మగౌరవం కోసమని మాట్లాడే చంద్రబాబు.. జనసేనను ప్రాధేయపడటం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎవరు ఎవరితో కలిసినా ప్రజల ఆదరాభిమానాలు సీఎం జగన్ పైన మెండుగా ఉన్నాయని 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, తుంపాల వరప్రసాద్, అక్బర్, డి.దుర్గారావు, ఎస్.రామకృష్ణ, డి.కృష్ణ, నగర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాన గంధ్వరుడు ఘంటసాల



ఘంటసాలకు స్వరాంజలి ఘటిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడ కల్చరల్: గాన గంధ్వరుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని డ్రీమ్ ఆడియో అధినేత చావ నరసింహరావు అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద ఘంటసాల 101వ జయంతి వేడుకలు, విన్నారా అలనాటి వేణుగానం పేరుతో స్వర నీరాజనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ ఘంటసాల అటు భక్తి గీతాలు, ఇటు విషాద గీతాలు, దేశభక్తి గీతాలు, ఏ పాటనైన తన స్వరంతో అద్భుతమైన ప్రతిభ చూపించగలరని తెలిపారు. ఘంటశాల లాంటి గాయకులు మనకు అరుదుగా కనిపిస్తారని పేర్కొన్నారు. ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, సీనియర్ గాయని వడ్డాది కామేశ్వరి, ఉమాబలరాం ఘంటసాల గాన వైభవం అంశంగా ప్రసంగించారు. మల్లంపల్లి రాజు, సుధాకర్, సాయిబాబు, కుటుంబరావు, సుధారాణి, విష్ణుప్రియ ఘంటసాల గీతాలను మధురంగా ఆలపించారు. నిర్వాహకులు ఘంటసాల చిత్ర పటాన్ని పూలమాలతో అలంకరించారు. ఘంటశాల అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.